క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ వైఖరి సరికాదు

కల్వకుర్తి రూరల్: బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద వైఖరి సరికాదని మాజీ మార్కెట్ డైరెక్టర్ గండోజు గంగాధర్ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు కేంద్రం ప్రభుత్వం చేతుల్లో ఉందని చెప్పడం సరికాదన్నారు. కొంతమంది కాంగ్రెస్ బీసీ నాయకులు కృష్ణయ్యపై చేసిన విమర్శలను ఖండించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం వెంటనే బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

యువతకు చేయూతనిస్తాం



కల్వకుర్తి రూరల్: యువతకు చేయూతనిస్తామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 90 మంది యువతకు ఉచిత లర్నింగ్ లైసెన్స్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసా బాలరాజ్, ప్రతాపరెడ్డి, ఇస్తారి, విజేందర్ రెడ్డి, మధు, పరమేష్, వినోద్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రవి, ఐలెన్, మహేందర్ ఫౌండేషన్ సభ్యులు గణేష్, శ్రీపతి, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరు, ఎంగంపల్లి గ్రామాల్లో గురువారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన గర్భిణులకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. గుండూరులో సూర్యలత కాటన్ మిల్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు అయినేని సూర్యప్రకాష్ రావు, ఎంగంపల్లిలో మాజీ సర్పంచ్ యాదగిరి రెడ్డి గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో గణేష్, లక్ష్మయ్య, నాగేంద్రం, బీరప్ప, లక్ష్మారెడ్డి, శివ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

లట్టుపల్లిని మండలం చేయాలని వినతి



బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లి, గంగారం గ్రామాలతో పాటు ఆయా గిరిజన తండాలను కలుపుతూ లట్టుపల్లిని మండలంగా ప్రకటించాలని కోరుతూ పలు గ్రామాల ప్రజలు గురువారం ఎంపీడీఓ కథలప్పగౌడుకు వినతిపత్రం అందజేశారు. పలు గిరిజన తండాలకు సంబంధించిన గిరిజన ప్రజాప్రతినిధులు, లట్టుపల్లి గ్రామ నాయకులు తమ గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరారు. చుట్టూ ఉన్న గిరిజన తండావాసులకు పరిపాలనపరంగా ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. నాయకులు భూషయ్య, రాజేందర్‌గౌడు, చంద్రగౌడు, ఉప్పేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మంత్రి జూపల్లి పరామర్శ

కొల్లాపూర్/చారకొండ: పట్టణంలోని జమ్మాన్ గడ్డకు చెందిన బోరెల్లి ఎల్లమ్మ(60) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం పరామర్శించారు. మృతురాలి భర్త బోరెల్లి సంగెం, కుమారుడు మహేష్‌లను ఓదార్చి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా చారకొండ మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన అర్కంటి బొందయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ గురువారం బాధిత కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించారు. ఆయన సమకూర్చిన రూ.3 వేల నగదును గ్రామ బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కాంగ్రెస్ నాయకులు ఎక్బాల్, హన్మంతునాయక్, నాగరాజు, ఖాదర్‌పాషా, మేకల రాముడుయాదవ్, బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, కట్టా శ్రీనివాసులు, చారకొండలో బీఆర్ఎస్ నాయకులు డి. శ్రీరాములు, ప్రశాంత్, రామస్వామి, ఆశోక్ తదితరులు ఉన్నారు.



చారకొండలో పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న డీఈఓ రమేష్‌కుమార్



ఉప్పునుంతలలో బాలుర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



కొల్లాపూర్ మండలం వరిదేలలో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



అప్పాబాద్‌లో...

విద్యార్థులకు ఘన స్వాగతం

సాక్షి, నెట్‌వర్క్: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలను మామిడి తోరణాలతో అలంకరించారు. అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి, ఉప్పునుంతలలో పాఠశాలలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా తొలిరోజు అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగత పలికారు. చారకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రార్థనకు డీఈఓ రమేష్‌కుమార్ హాజరయ్యారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వెల్దండ మండలం కొట్ర ఉన్నత పాఠశాలను రాష్ట్ర ఎడ్యూకేషన్ కమీటి మెంబర్ చారకొండ వెంకటేష్ తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. బిజినేపలి మండలం నందివడ్డెమాన్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలతో పాటు కారుకొండలో, అదేవిధంగా కల్వకుర్తి లింగసానిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల, కోడేరుతో పాటు కేజీవీబీ, ఖానాపూర్ పాఠశాల, పెద్దకొత్తపల్లి మండలం చంద్రబండతండా, లింగాల, దోమలపెంటలలో ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. తాడూరు మండలం అల్లాపూర్‌లో నూతనంగా విద్యార్థులను చేర్చుకున్నారు. కొల్లాపూర్‌లో ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓ ఇమ్మానుయేల్ సందర్శించారు. బిజినేపల్లి, కోడేరు ఎంఈఓలు రఘునందన్‌రావు, భాస్కర్‌శర్మ, హెచ్ఎంలు పాల్గొన్నారు.



చారకొండ మండలం తుర్లపల్లిలో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



పెద్దకొత్తపల్లి చంద్రబండతండాలో..



కోడేరులో ..



బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్‌లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు



కల్వకుర్తిలో ..



బిజినేపల్లి మండలం కారుకొండలో..

సీపీఎం నాయకుల నిరసన

తాడూరు: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాని అధికారులకు అందజేశారు. అనంతరం ఆ పార్ట మండల కార్యదర్శి కాశన్న మాట్లాడుతూ రైతు భరోసా, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. నాయకులు కుర్మయ్య రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

కోడేరు: మండలంలోని జెడ్పీహెచ్ఎస్ నర్సాయిపల్లి పాఠశాలలో 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో గ్రామానికి చెందిన శివారెడ్డి 13 మంది విద్యార్థులకు రూ.10 వేల నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మూతబడిన పాఠశాల పునఃప్రారంభం

పెద్దకొత్తపల్లి: పెద్దకారుపాముల గాంధీనగర్‌లో ఉన్న పాఠశాలను మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం పునఃప్రారంభించారు. రెండు సంవత్సరాల కిందట విద్యార్థులు లేక మూసివేశారు. కొత్తగా విద్యార్థులను చేర్పించి వారికి దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యమ్మ, అలివేల, మంజుల, సీఆర్పీలు మురళీ, ఈశ్వర్, రాములు పాల్గొన్నారు.

రైతు భరోసా అమలు చేయాలి



తాడూరు : రైతుభరోసా పథకం కింద ఇచ్చే పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బలాన్‌పల్లిలో నిర్వహించిన మండల శాఖ సమాశంలో అయన పాల్గొని మాట్లాడారు. నాయకులు కుతుబోద్దిన్, శివశంకర్, కృష్ణన్న గౌడ్, నారాయణ, బాలయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దకొత్తపల్లి/ఉప్పునుంతల/చారకొండ/బల్మూర్ : కొత్తగా భూములు కొనుగోలు లేదా విరాసత్ చేసుకొని జూన్ 5వ తేదీ 2025 సంవత్సరం వరకు రిజిస్ట్రేషన్లు చేసుకున్న రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తులు చేసుకోవాలని పెద్దకొత్తపల్లి, ఉప్పునుంతల, చారకొండ, బల్మూర్ ఏఓలు శిరిష, కొట్ర రమేష్ నాయక్, తనూజరాజ్, నరేష్‌లు గురువారం ప్రకటనలో తెలిపారు.పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్కు జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతచేసి ఈనెల 20వ తేదీ వరకు సంబంధిత ఏఈఓకు లేదా మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

రైతులు వినియోగించుకోవాలి

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని రైతు వేదిక వద్ద కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రైతుల కోసం శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇబ్రహీం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ సదస్సును రైతులు వినియోగించుకోవాలని కోరారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



కల్వకుర్తి మండలం తాండ్రలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం



పెద్దకొత్తపల్లి మండలం నారాయణపల్లిలో..

కల్వకుర్తి రూరల్/పెద్దకొత్తపల్లి/తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాలల్లో గురువారం రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. కల్వకుర్తి మండలం తాండ్రలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ ఇబ్రహీం, పెద్దకొత్తపల్లి మండలం నారాయణపల్లిలో రెవెన్యూ సదస్సులో డీటీ రమేష్‌నాయక్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తాడూరు మండలం సిర్సవాడలో గ్రామసభలు నిర్వహించారు. మొత్తం 26 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ జయంతి, డిప్యూటీ తహసీల్దార్ మహమూద్ అలీ తెలిపారు.

‘పీసా’ కమిటీ ఎన్నిక వాయిదా

బల్మూర్: ఏజెన్సీ గ్రామమైన బల్మూర్‌లో గురువారం నిర్వహించాల్సిన పీసా(పంచాయతీ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియా యాక్ట్) కమిటీ గందరగోళం మధ్య వాయిదా పడింది. స్థానిక ఆదివాసి చెంచు, ఎరుకల గిరిజనులతో ఏర్పాటు చేయనున్న ఈ కమిటీ ఎన్నిక కోసం స్థానిక గ్రామ పంచాయతీ సమీపంలోని గ్రంథాలయం ఆవరణంలో పీసా కమిటీ జిల్లా కోఆర్డినేటర్ లలిత సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి కోరానికి తగినంత మంది చెంచులతో పాటు గ్రామ ప్రత్యేకాధికారి అయిన ఎంపీడీఓ రాఘువులు కూడా హాజరు కాలేదు. ఇదిలా ఉండగా పీసా కమిటీ ఏర్పాటు చేసి ఉమామహేశ్వర రిజర్వాయర్ వద్దని తీర్మానం చేయించాలని అక్కడికి పెద్ద సంఖ్యలో వచ్చిన భూనిర్వాసితులకు, స్థానిక కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కొంత సమయం గందరగోళ వాతావరణం ఏర్పడింది. దీంతో పీసా కమిటీని వాయిదా వేస్తున్నట్లు కోఆర్డినేటర్ ప్రకటించి అక్కడి నుంచి వెళ్లింది.



వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న కోఆర్డినేటర్

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో సర్వే నంబర్ 182లో బ్లాక్ గ్రానైట్ తవ్వకాలను నిలిపివేసి, అనుమతులు రద్దు చేయాలని గురువారం రైతులు, గ్రామస్తులు, యువకులు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మైనింగ్ ఆర్ఐ చైతన్యకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు ఈ నెల 10న యంత్రాలతో గుట్టపై చేపట్టిన తవ్వకాల పనులను నిలిపివేసినట్లు వివరించారు. దీనికి మైనింగ్ ఆర్ఐ స్పందిస్తూ తవ్వకాలకు అనుమతులు ఇచ్చామని తెలపగా గ్రామస్తుల అనుమతి లేకుండా ఎలా ఇస్తారని వాగ్వివాదానికి దిగారు. అనుమతులు రద్దు చేసేవరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కృష్ణయ్య, ఎల్లయ్య, దేవయ్య, చంద్రయ్య, బుచ్చయ్య, రాములు, అంజయ్య, పాపయ్య, మొగిలయ్య ,గ్రామస్తులు, యువకులు తదితరులు ఉన్నారు.



మైనింగ్ ఆర్ఐ చైతన్యకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

క్రీడాశాఖ మంత్రికి సన్మానం

వెల్దండ: మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ మహాసభ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు నూకం వెంకటయ్య గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాకాటి శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బల్ల సత్తయ్యముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి యాదయ్య ముదిరాజ్, సంఘం నాయకులు ఉన్నారు.

భాష మార్చుకోకుంటే గుణపాఠం తప్పదు

మన్ననూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అసభ్యకరమైన భాష మార్చుకోకుంటే ప్రజలే గుణపాఠం చెప్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సంబు వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై మాజీ సీఎం కేసీఆర్‌ను విచారణకు పిలిస్తే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నాడని అలాంటి వ్యక్తిపై అనుచితమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తరముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో భక్తుల ఆర్థికసాయంతో నిత్యాన్నదానాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సిద్దిపేట జిల్లా పార్వతీపురం గ్రామానికి చెందిన సింగంశెట్టి సైదయ్య, శ్రావణి దంపతులు నిత్యాన్నదానానికి రూ. 25,116లు విరాళం అందించారు. దాతలను ఆలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెమలి అప్పగింత

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌తండాలో అంజినాయక్ వ్యవసాయ పొలంలో గురువారం నెమలి లేవలేనిస్థితిలో కన్పించింది. రైతులు పట్టుకొని ఫారెస్టు అధికారి లలితకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి అప్పగించారు. పశువైద్య అధికారులను పిలిపించి మందులు వేశారు. నెమలి సాధారణ స్థితికి రావడంతో బైరాపూర్ సమీపంలోని అడవిలో వదిలేసినట్లు ఫారెస్టు అధికారులు వివరించారు.

బీజేపీతోనే సుపరిపాలన

అచ్చంపేట రూరల్/కల్వకుర్తి రూరల్/కందనూలు/తిమ్మాజిపేట: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో మోదీ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన, జనధన్ యోజన వంటి పథకాలతో కోట్లాది మంది నిరుపేదలకు, అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. నాయకులు మంగ్యానాయక్, రేణయ్య, బాలాజీ, వెంకటిశెట్టి, శ్రీనివాస్‌గౌడ్, చందులాల్‌చౌహాన్, రవీందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

» బీజేపీతోనే సుపరిపాలన సాధ్య మని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి అన్నా రు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బాబీ దేవ్ జెండా ఎగురవేసి కార్యశాల కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాలు భారత వైపు చూస్తోందని కొనియాడారు. భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాలతో పోటీపడుతుందన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, రాంభూపాల్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, శేఖర్ రెడ్డి, నరసింహ,రవి గౌడ్, అఖిలాష్ గౌడ్, శివ, పర్వతాలు, లక్ష్మీ నరసింహ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

» కల్వకుర్తి బీజేపీ ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ, మల్లేష్, సువర్ణ, రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా శ్రీశైలం, శ్రీనివాసులు, కార్యదర్శులుగా సైదులు గౌడ్, లింగారెడ్డి, స్వరూప, శ్రీలత, కోశాధికారిగా రాఘవేంద్ర చారితో పాటు 34 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

» నాగర్‌కర్నూల్ పట్టణ బీజేపీ కమిటీని జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా చెవ్వ ప్రమోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా వారధి శ్రీను పటేల్, కొండ కింది జగదీశ్వర్‌రెడ్డితో పాటు 45 మందిని ఎన్నుకున్నారు.

» తిమ్మాజిపేట ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోల్‌దాసు రాము హాజరై మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రధాని మోదీ పాలనపై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. మండల అధ్యక్షుడు యశ్వంత్, మాజీ జెడ్పీటీసీ కృపానందం, వేణుగోపాల్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

కల్వకుర్తి రూరల్: ఐక్యత ఫౌండేషన్, శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో జూలై 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

కొల్లాపూర్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని ప్రజావికాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కలమంద శేఖర్ కోరారు. గురువారం అంబేడ్కర్ కాలనీలో బాలకార్మిక వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కాలనీకి చెందిన ఇద్దరు బాలికలు పనికి వెళ్లడంతో వారికి చదువు ప్రాధాన్యాన్ని వివరించి బడిలో చేరేందుకు ఒప్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి శ్రీకాంత్, జగదీష్ తదితరులు ఉన్నారు.

ఈద్గా, కబ్రస్తాన్ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో సర్వే నంబర్ 934లో ఉన్న ఈద్గా, కబ్రస్తాన్ స్థలం ఆక్రమణకు గురైందని గ్రామ ముస్లిం మైనారిటీ కమిటీ నాయకులు గురువారం తహసీల్దార్ ప్రమీలకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి ఆక్రమణకు గురైన స్థలాన్ని ఇప్పించాలని కోరారు. మైనారిటీ కమిటీ నాయకులు ఇబ్రహీం, బషీర్, బాబా, సైదులు, జహీర్ తదితరులు ఉన్నారు.

పంచముఖికి ప్రత్యేక బస్సు

కొల్లాపూర్: ఈ నెల 25వ తేదీన అమావాస్య సందర్భంగా కొల్లాపూర్ నుంచి పంచముఖి హనుమాన్ ఆలయానికి ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం ఉమాశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కొల్లాపూర్ నుంచి బస్సు బయలుదేరుతుందని, అక్కడ రాత్రికి భక్తులకు బస ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం మంత్రాలయం చేరుకొని అక్కడ నదీస్నానాలు, రాఘవేంద్రస్వామి దర్శనము అనంతరం బస్సు కొల్లాపూర్‌కు తిరుగుప్రయాణం అవుతుందని వివరించారు. రానుపోను చార్జీలు ఒక్కొక్కరికి రూ.800లు ఉంటుందని తెలిపారు.బుకింగ్ కోసం సెల్ నంబర్: 90004 04878, 93460 42080 కు ఫోన్ చేయాలని కోరారు.

చిన్నారుల సంఖ్య పెంచాలి



కందనూలు: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల సంఖ్యను పెంచాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి కోరారు. గురువారం నాగర్‌కర్నూల్ మండలంలోని నాగనూల్‌లో అమ్మ మాట – అంగన్‌వాడీ బాటలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీగా వెళ్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి, సీడీపీఓ సంగీత, అంగన్‌వాడీ టీచర్లు సంజీవమ్మ, సుశీల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లింగాల: అంగన్‌వాడీ కేంద్రాలలో అమలవుతున్న పూర్వ ప్రాథమిక విద్య భవిష్యత్తుకు పునాదిలాంటిదని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్, సీడీపీఓ దమయంతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాటలో భాగంగా కొత్త అడ్మిషన్లను ప్రారంభించారు. 5 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని వారు తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కొల్లాపూర్: అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్వీ నాయకులు మండల విద్యాధికారి ఇమ్మానుయేల్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం వారు ఎంఈఓను కలిశారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని వివరించారు. ఒలంపియాడ్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ వంటి పేర్లతో ఏర్పాటుచేసే స్కూళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు ఎండీ.సోహైల్, మాసూంబాబా, శివ, జయరాం, శ్రీమాన్ తదితరులున్నారు.

కేజీబీవీలో ఇంటర్ తరగతులు ప్రారంభం

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఇంటర్ తరగతులను ప్రత్యేకాధికారి సుజాత ప్రారంభించారు. విద్యాలయంలో ఇప్పటి వరకు 10 తరగతి వరకు మాత్రమే ఉండేదని ఇకనుంచి ఇంటర్ వరకు విద్యాభ్యాసం కొనసాగించవచ్చని ఆయన తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సివిక్స్, ఎకానిమిక్స్, కామర్స్, ఇంగ్లీష్, తెలుగు, ఎంపీహెచ్‌డబ్ల్యూ సబ్జెక్టులు బోధించేందుకు ఆసక్తి గల అతిథి అధ్యాపకులు ఈనెల 13 నుంచి 16 వరకు విద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భూమిపూజ

బిజినేపల్లి: మండలంలోని పెద్దతాండ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గురువారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హాల్యా, నాయకులు వీరెందర్, హరీష్‌రెడ్డి రవినాయక్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.